సాక్షి
నల్లగొండ
సోమవారం ; 3 ; జూలై ; 2023



కొత్త రైలు మార్గం
డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు కొత్త రైలు మార్గం ఏర్పాటు కానుందని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



బడులను కాపాడుకోవాలి
ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37° / 27°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి
మిర్యాలగూడ : ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తామని పేర్కొన్నారు. జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు. ఆసక్తి గల రైతులు విక్రయ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ధర్నాను విజయవంతం చేయాలి
మాడుగులపల్లి : పేదలందరికీ ప్రభుత్వమే ఇంటి స్థలం కేటాయించి, గృహలక్ష్మి పథకం కింద నిర్మాణానికి రూ.5 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాలు లేక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, సర్కారు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాలను గుర్తించి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు. 25 ఏండ్లుగా ఈ విషయాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పేదలకు గూడు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐక్యతతో అధికారంలోకి వస్తాం
- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి

నకిరేకల్ : అందరం ఐక్యంగా ఉండి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్‌ను గద్దె దింపి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని సీఎల్‌పీ మాజీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో కాంగ్రెస్ సభకు వెళ్తున్న ఆయన నకిరేకల్‌లోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ఇంట్లో విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు అందరం ఐక్యతగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, జటంగి వెంకటనర్సు, యాసా కరుణకార్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, బొప్పని యాదగిరి, ముక్కాముల శేఖర్ తదితరులు ఉన్నారు.

ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధికి కృషి



పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్

నాగారం: మండలంలోని ఫణిగిరిలో గల బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఆదివారం ఆయన ఫణిగిరిలోని బౌద్ధక్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫణిగిరి గ్రామంలో బౌద్ధ సంపద భద్రపరిచేందుకు మ్యూజియం ఏర్పాటుకు పరిసర ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రం పురాతన, చారిత్రక ప్రాంతమన్నారు. అనంతరం గ్రామంలోని తాత్కాలిక మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధ సంపదను పరిశీలించారు. ఫణిగిరిలోని బౌద్ధ సంపదను చూసేందుకు విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నందున గ్రామంలో అంతర్జాతీయ స్థాయిలో మ్యూజియం నిర్మించాలని ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గట్టు నర్సింహారావు.. పురావస్తుశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట పురావస్తు శాఖ టెక్నికల్ ఇంజనీరింగ్, మ్యూజియం విభాగాలకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు రాములునాయక్, నారాయణ, ఏడీలు నాగరాజు, బుజ్జి, ఎంపీఓ ధార శ్రీనివాస్, కార్యదర్శి సిబ్బంది గట్టు వీరయ్య, కార్తీక్ ఉన్నారు.

చెత్తశుద్ధికి సిద్ధం

- మున్సిపల్ డంపింగ్ యార్డుల్లో బయో మైనింగ్ ప్లాంట్లు
- నీలగిరి, మిర్యాలగూడ పట్టణాల్లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం
- శుద్ధి కానున్న 1.75 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త
- వర్మీ కంపోస్ట్, విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం



మిర్యాలగూడ మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను శుద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డంపింగ్ యార్డుల్లో వేల మెట్రిక్ టన్నుల్లో చెత్త పేరుకుపోవడంతో వాటిని తొలగించి శుభ్రం చేయడం మున్సిపల్ యంత్రాంగాలకు సవాల్‌గా మారుతుంది. దీంతో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను తీసుకెళ్లి అక్కడ పోయడానికి రానున్న రోజుల్లో స్థలం కొరత ఏర్పడే అవకాశం ఉంది. అదేవిధంగా ఇలా చెత్త కుప్పలు ఏళ్ల తరబడి పేరుకుపోవడం వల్ల తీవ్రమైన దుర్వాసన రావడం, పర్యావరణం కూడా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో బయో మైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి చెత్త సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లోభాగంగా నీలగిరి, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో బయో ప్లాంట్లు ఏర్పాటు చేసి ఆయా యార్డుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయనున్నారు. తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా, పొడి చెత్తను కరెంట్ తయారు చేసి సిమెంట్ కంపెనీలకు సరఫరా చేయనున్నారు.

రెండు మున్సిపాలిటీల్లో చెత్త ఇలా..
నీలగిరి మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో లక్షా మూడువేల మెట్రిక్ టన్నుల చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అదేవిధంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో 75 వేల మెట్రిక్ టన్నుల చెత్త కుప్పలుగా పడి ఉంది. ప్రతిరోజూ నీలగిరి పట్టణంలో 100, మిర్యాలగూడ పట్టణంలో 50 మెట్రిక్ టన్నుల చెత్తను ఆయా పట్టణాల్లోని డంపింగ్ యార్డులకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. వీటిల్లో తడి చెత్తను మాత్రమే వర్మీ కంపోస్ట్ ఎరువుగా తయారు చేస్తుండగా, పొడి చెత్త అంతా కుప్పలుగా పడి ఉంటుంది. ఇలా ఈ రెండు మున్సిపాలిటీల్లో లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయినట్లు సంబంధిత మున్సిపాలిటీల అధికారులు ప్రభుత్వానికి వివరాలు పంపారు. దాని ఆధారంగానే చెత్త శుద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలవనుంది. ఇప్పటికే ఒకసారి టెండర్లు పిలవగా ఓ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకోగా వివిధ కారణాలతో ఆ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు తెలిసింది.

ఇకనుంచి రోజు వారీగా..
ఆయా డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను శుద్ధి చేస్తే మరో 20 ఏళ్ల వరకు స్థలం కొరత ఉండదని అధికారులు భావిస్తున్నారు. బయో మైనింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే ఏ రోజు వచ్చే చెత్తను అదే రోజు లేదా మరుసటి రోజే శుద్ధి చేసేలా చర్యలు తీసుకోనున్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా, విద్యుత్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నల్లగొండ		మిర్యాలగూడ
48	వార్డులు	48
2.60 లక్షలు	జనాభా	1.33 లక్షలు
31,500	గృహాలు	26,560
96.40 మెట్రిక్ టన్నులు	ప్రతిరోజూ చెత్త సేకరణ	50 మెట్రిక్ టన్నులు
5.10 మెట్రిక్ టన్నులు	కంపోస్ట్ ఎరువు తయారీ	3 మెట్రిక్ టన్నులు
1.03 లక్షల మెట్రిక్ టన్నులు	డంపింగ్ యార్డులోని చెత్త	75 వేల మెట్రిక్ టన్నులు

బయో మైనింగ్ ప్లాంట్లతో చెత్త కుప్పలు శుభ్రం



డంపింగ్ యార్డుల్లో భారీగా చెత్త కుప్పలు నిల్వలు ఉన్నాయి. బయో మైనింగ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి చెత్త కుప్పలను వేరు చేసి ఎరువుతోపాటు కరెంట్‌ను ఉత్పత్తి చేస్తారు. రాష్ట్ర స్థాయిలో టెండర్లు నిర్వహించి ఇక్కడ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తారు. త్వరలోనే ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.
– రమణాచారి, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

చెత్త సమస్యకు త్వరలోనే పరిష్కారం



మున్సిపాలిటీ నుంచి సేకరించే తడి, పొడి చెత్తను బయో మైనింగ్ సంస్థకు అప్పగిస్తున్నాం. గతంలోనే ఇందుకోసం చర్యలు తీసుకోగా అనివార్య కారణాల వల్ల హర్షిత ఇన్ఫ్రా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెండర్లు రద్దయ్యాయి. సీడీఎంఏ ద్వారా మరోసారి టెండర్లు వేసి కొత్త వారికి అవకాశం ఇవ్వనుంది. త్వరలోనే ఈ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభించనుంది.
– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

చినుకు.. చింత!



చందంపేట మండలంలో వాడుపట్టిన పత్తి మొక్కలు

ముఖం చాటేసిన వరుణుడు
- జూన్ నెలలో లోటు వర్షపాతం నమోదు
- వాడిపోతున్న పత్తిమొక్కలు
- మొలకలను కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు

నల్లగొండ అగ్రికల్చర్ : వరుణుడు ముఖం చాటేశాడు. కోటి ఆశలతో వానాకాలం సాగును ప్రారంభించిన రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నాడు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురవడంతో దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలను విత్తుకున్నారు. వారం రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరగడంతో భూమిలో వేసిన విత్తనాలు మాడిపోతున్నాయి. అక్కడక్కడా మొలకెత్తిన మొలకలు పదును లేని కారణంగా ఎండిపోతున్నాయి. పత్తి మొక్కలను రక్షించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బిందెలతో నీళ్లు చల్లుతూ, ట్యాంకర్లు, స్ప్రింక్లర్ల చేత నీటిని అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షం కురిస్తేనే పత్తి మొక్కలు బతుకుతాయి. కానీ ఇదే పరిస్థితి మరో రెండు మూడు రోజులు కొనసాగితే పత్తి విత్తనాల కోసం వెచ్చించిన కోట్లాది రూపాయలను రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

ఎక్కువ మండలాల్లో లోటు వర్షపాతం..
జూన్ నెల మొత్తం జిల్లాలో సాధారణ వర్షపాతం 87.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా.. 82.9 మి.మీ వర్షం కురిసింది. కేతేపల్లి, మునుగోడు, త్రిపురారం, వేములపల్లి, చింతపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చందంపేట మండలాల్లో మాత్రమే సాధారణ వర్షం కురిసింది. నార్కట్‌పల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, తిప్పర్తి, మాడ్గులపల్లి, మర్రిగూడ మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసింది. కొండమల్లేపల్లి, నేరెడుగొమ్ము, పీఏపల్లి, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, అడవిదేవులపల్లి, నిడమనూర్, అనుముల, హాలియా, కనగల్, చిట్యాల మండలాల్లో సాధారణ వర్షం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

సాగు వెనుకబాటు..
జిల్లాలో ఇప్పటి వరకు 6.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా కేవలం 80,160 ఎకరాల్లో మాత్రమే పత్తి విత్తనాలను రైతులు విత్తుకున్నారు. అందులో సగానికిపైగా ఎకరాల్లో పత్తి గింజలు మొలకెత్తలేదు. ఇక, వరి 5.25 లక్షల ఎకకరాల్లో సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు నాన్‌ఆయకట్టు ప్రాంతంలో బోర్లు, బావుల కింద కేవలం 1,015 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. వర్షాలు లేని కారణంగా రైతులు నార్లు పోసుకుని నాట్లు వేసుకునేందుకు ముందుకురావడం లేదు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఇప్పటివరకు రైతులు పదుల సంఖ్యలో మాత్రమే వరి నార్లు పోసుకున్నారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల తేదీని ప్రకటిస్తేనే రైతులు వరి నార్లు పోసుకుని నాట్లు వేసుకునేందుకు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

తొందరపడి విత్తనాలు వేసుకోవద్దు



రైతులు తొందరపడి పత్తి విత్తనాలను విత్తుకోవద్దు. భూమిలో సరైన తేమలేకుంటే విత్తనాలు మొలకెత్తవు. ముఖ్యంగా తేమలేకుంటే ఎర్ర నేలలో మొలకలు ఎండిపోయే అవకాశం ఉంటుంది. జూలై 15వ తేదీ వరకు ఆరుతడి పంటల విత్తనాలు వేసుకోవచ్చు. సరైన వర్షం కురిస్తేనే విత్తనాలు వేసుకోవాలి. పదునయ్యే వర్షం వస్తేనే విత్తనాలు పెట్టుకోవాలి. లేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.
– వై.సుచరిత, డీఏఓ

పోడుకు పట్టాభిషేకం

- నేడు కలెక్టరేట్‌లో పోడు రైతులకు పట్టాల పంపిణీ
- 2,928 మంది రైతులకు 5,577 ఎకరాలపై హక్కులు
- హాజరుకానున్న మంత్రి జగదీష్‌రెడ్డి



భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

నల్లగొండ : ఏళ్ల తరబడి అటవీ భూములను సాగు చేసుకుంటూ వాటిపై ఎలాంటి హక్కులు లేకుండా ఇబ్బందులు పడుతున్న పోడు రైతుల కష్టాలు తీరనున్నాయి. సోమవారం మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా పోడు పట్టాలను పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,928 మంది రైతులకు 5,577 ఎకరాలపై హక్కులు దక్కనున్నాయి.

గ్రామసభల ద్వారా ఎంపిక..
పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో 2021 నవంబర్‌లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. గిరిజనులు, గిరిజనేతరులు కలిపి 20,446 మంది 55,702 ఎకరాలపై హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం సర్వేలను నిర్వహించి ఎంత సాగు చేసుకుంటున్నారనేది గుర్తించారు. గ్రామ స్థాయిలో కమిటీలతోపాటు డివిజన్ స్థాయిలో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అర్హుల జాబితాను ఫైనల్ చేసింది.

13 మండలాల వారికి పట్టాలు..
నల్లగొండలో 3 నియోజకవర్గాల పరిధిలో 13 మండలాల్లో 2,928 మంది రైతులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి సోమవారం ఉదయాదిత్య భవన్‌లో పట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేలు కూడా పాల్గొనున్నారు.

నిరాశలో గిరిజనేతరులు..
అటవీ భూములను సాగు చేసుకుంటున్న వారిలో గిరిజనులతోపాటు గిరిజనేతరులు కూడా ఉన్నారు. అయితే ప్రస్తుతం గిరిజనులకు మాత్రమే పట్టాలను అందిస్తున్నారు. గిరిజనేతరుల నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వారికి ప్రస్తుతం పట్టాలు ఇవ్వడం లేదు. వారికి పట్టాలు ఎప్పుడిస్తారనేది కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో గిరిజనేతరులు నిరాశలో ఉన్నారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు
రామగిరి(నల్లగొండ) : గురు పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లాలో ఉన్న సాయిబాబా మందిరాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. గురు పౌర్ణమి సందర్భంగా అన్ని దేవాలయాల్లో బాబా దర్శనానికి క్యూలైన్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బాబాను వీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు.

పారదర్శకంగా క్రమబద్ధీకరణ చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- జీఓ 58, 59పై తహసీల్దార్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి


నల్లగొండ : జీఓ 58, 59 కింద అర్హులైన లబ్ధిదారుల స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో జీఓ 58, 59పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 31, 2023 వరకు జీఓ 58 కింద వచ్చిన 4,581, జీఓ 59 కింద వచ్చిన 6,039, మొత్తం కలిపి 10,620 దరఖాస్తులను తహసీల్దార్‌లు మొబైల్ యాప్ ద్వారా లాగిన్ ఐడీ ఏర్పాటు చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులు, అనర్హుల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు గోపిరాంనాయక్, చెన్నయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా దరఖాస్తులు ఇలా..
జీఓ 58 కింద..
- దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లో 732 దరఖాస్తులు రాగా వాటిలో పీఏపల్లి 16, గుండ్లంపల్లి 1, గుర్రంపోడు 1, దేవరకొండ 461, చందంపేట 2, చింతపల్లి 28, కొండమల్లేపల్లి 216, నేరేడుగొమ్ము 1, నాంపల్లి 6.
- మిర్యాలగూడ డివిజన్‌లో 2103 దరఖాస్తులు వాటిలో తిరుమలగిరి సాగర్ 2, పెద్దవూర 943, దామరచర్ల 23, త్రిపురారం 14, అనుముల 128, నిడమానూరు 14, మిర్యాలగూడ 969, అడవిదేవులపల్లి 8, వేములపల్లి 2.
- నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో 1,746 దరఖాస్తులు రాగా వాటిలో నకిరేకల్ 52, నల్లగొండ 1,436, చిట్యాల 47, కట్టంగూర్ 30, శాలిగౌరారం 2, తిప్పర్తి 5, కనగల్ 32, నార్కట్‌పల్లి 36, చండూర్ 16, మునుగోడు 90.

జీఓ 59 కింద..
- దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లో 242 దరఖాస్తులు రాగా వాటిలో పీఏ పల్లి 7, గుండ్లంపల్లి 2, దేవరకొండ 45, చందంపేట 3, చింతపల్లి 18, కొండమల్లేపల్లి 127, నేరెడుగొమ్ము 1, నాంపల్లి 38, మర్రిగూడ 1.
- మిర్యాలగూడ డివిజన్‌లో 4,963 దరఖాస్తులు రాగా తిరుమలగిరిసాగర్ 4, పెద్దవూర 1,388, దామరచర్ల 43, త్రిపురారం 17, అనుముల 45, నిడమనూరు 21, మిర్యాలగూడ 3,425, అడవిదేవులపల్లి 8, మాడుగులపల్లి 2, వేములపల్లి 10.
- నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 834 దరఖాస్తులు రాగా నకిరేకల్ 36, కేతేపల్లి 2, నల్లగొండ 521, చిట్యాల 76, కట్టంగూర్ 28, శాలిగౌరారం 7, తిప్పర్తి 4, కనగల్ 28, నార్కట్‌పల్లి 37, చండూర్ 12, మునుగోడు 83.

అంగన్‌వాడీ గుడ్డుపై 'ముద్ర'

- పక్కదారి పట్టకుండా ఉండేందుకే నిర్ణయం
- మూడు రంగుల్లో.. మూడు విడతలుగా సరఫరా



అంగన్‌వాడీలకు సరఫరా అయ్యే గుడ్లపై ముద్ర

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసే కోడిగుడ్లు పక్కదాటి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కోడిగుడ్డుపై అంగన్‌వాడీ కోడిగుడ్ల పేరుతో లోగోను ముద్రించి ఆయా కేంద్రాలకు కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. జిల్లాలో 2093 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా కోడిగుడ్లతో పాటు పౌష్టికాహారం, సరుకులు వంటివి లబ్ధిదారులకు సరఫరా చేస్తుంది. ప్రతి కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని ముద్ర వేస్తున్నారు.

విడతల వారీగా సరఫరా..
అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడి గుడ్లు మూడు రంగులు, మూడు విడతల్లో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు సార్లుగా గుడ్లు సరఫరా చేస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవి కాలంలో గుడ్లు త్వరగా పాడైపోయే ప్రమాదం ఉండటంతో నెలకు మూడు దఫాలుగా సరఫరా చేస్తారు. వేసవి కాలంలో అందించే గుడ్లపై నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులు కాగా చలికాలం, వర్షకాలంలో అందించే గుడ్లపై ఎరుపు, ఆకు పచ్చ రంగులను ముద్రిస్తారు. ముద్ర మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం ఏ జోన్ పరిధిలోకి వస్తుందో.. ఆ జోన్ నంబర్లను కూడా స్పష్టంగా కనిపించేలా ముద్రిస్తున్నారు. ప్రత్యేకమైన ముద్ర వేసి ఈ గుడ్లను ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ముద్ర ఉన్న గుడ్లు సరఫరా చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లపై ఇక నుంచి ముద్ర వేసిన అందిస్తున్నాం. సరుకులు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోడిగుడ్లపై లోగోను ముద్రిస్తోంది. బ్యాచ్ నంబర్లు ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు అందించడం కూడా సులువుగా ఉంటుంది. పారదర్శకంగా ఉండేందుకు లబ్ధిదారులకు ఈనెల 4వ తేది నుంచి ముద్ర ఉన్న గుడ్లను అందిస్తున్నాం.
– కృష్ణవేణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ, నల్లగొండ

హక్కులపై అవగాహన ఉండాలి
నాగారం: మానవ హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్, సోషన్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కమిటీల ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల గురించి విద్యార్థులు, యువత ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, న్యాయ, రెవెన్యూ సమస్యలపై స్పందించి పేదలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం జిల్లా సోషల్ జస్టిస్ జాయింగ్ సెక్రటరీగా ఈటూరు గ్రామానికి చెందిన పార్ల నాగరాజు, నాగారం మండల అధ్యక్షుడిగా వర్ధమానుకోట గ్రామానికి చెందిన వంగూరి సుదర్శన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల శ్రీనివాస్, గాదె కృష్ణ పాల్గొన్నారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న హుస్సేన్

యాదాద్రీశుడికి నిత్యారాధనలు



ప్రధానాలయంలో బారులు తీరిన భక్తులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకుజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. సుప్రభాత సేవ చేపట్టారు. ఆ తర్వాత స్వయంభూవులకు బిందెతీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీదళాలు అర్పించారు. అదే విధంగా ప్రాకార మండపాల్లో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహనసేవ, నిత్య కళ్యాణం, జోడు సేవలు జరిపించారు. స్వామివారికి రాత్రి శయనోత్సవ చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజల ద్వారా స్వామివారికి నిత్యాదాయం రూ.54,03,802 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పాలకవీడు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ లింగయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని ముసిఒడ్డుసింగారం గ్రామం నుంచి మఠంపల్లి మండలానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పాలకవీడు మండల కేంద్రం శివారులో ఆదివారం తెల్ల వారుజామున కాపుగాసి ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లలో 4 ముసిఒడ్డుసింగారం గ్రామానికి చెందినవి కాగా మరొకటి యల్లాపురం గ్రామానికి చెందినదిగా గుర్తించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ చోరీకి యత్నం

- దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత


దొంగను పట్టుకున్న స్థానికులు

నల్లగొండ క్రైం: పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో ఓ హోటల్ వద్ద ఆదివారం బైక్ చోరీ చేసేందుకు యత్నించిన దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు.. కలెక్టరేట్ సమీపంలోని హోటల్ వద్ద ఓ వ్యక్తి తన బైక్ ఆపి టీ తాగేందుకు వెళ్లగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దొంగ ఆ బైక్‌ను చోరీ చేసేందుకు యత్నించాడు. స్థానికులు గుర్తించి దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి టూటౌన్ పోలీసులకు అప్పగించారు. సదరు దొంగకు తెలుగు రాకపోవడంతో తన వివరాలు ఏమీ చెప్పడంలేదని పోలీసులు పేర్కొన్నారు. దొంగ వేలిముద్రలను పరిశీలించగా పట్టణంలో జరిగిన దొంగతనాల్లో అతడి పాత్ర లేదని నిర్ధారణ అయ్యిందని పోలీసులు చెబుతున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

చివ్వెంల(సూర్యాపేట): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చివ్వెంల మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన మండవ యల్లయ్య, సైదమ్మ దంపతుల చిన్న కుమారుడు మండల సందీప్(27) వృత్తిరీత్యా బోరుబావి మోటార్లను రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సందీప్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లి తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చి తలుపులు తీయగా సందీప్ ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండటం గమనించి బోరున విలపించారు. ఇరుగు పొరుగు వారి సహకారంతో మృతదేహాన్ని కిందకు దించారు. మృతుడు అవివాహితుడు కాగా, అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు, డీజిల్ చోరీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజీరామారంలో శనివారం రాత్రి 8 ట్రాక్టర్ల బ్యాటరీలు, డీజిల్‌ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు.. ఖాజీరామారం గ్రామానికి చెందిన సుంకరి సైదులు, పాలకూరి అంజయ్య, నకిరేకంటి సైదులు, అనంతుల యుగంధర్, సల్వాది సైదులు, నకిరేకంటి లచ్చయ్య, తేరేపల్లి సైదులు, బుర్రి మహేష్ ట్రాక్టర్లలో బ్యాటరీలు, డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి దొంగల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- గ్రూప్–4 పరీక్ష రాసేందుకు ఇంటికి వచ్చి డ్యూటీకి వెళ్తుండగా ఘటన


సైదులు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: గ్రూప్–4 పరీక్ష రాసేందుకు శనివారం ఇంటికి వచ్చిన కానిస్టేబుల్ ఆదివారం తిరిగి డ్యూటీకి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణకాలనీ బైపాస్ వద్ద చోటుచేసుకుంది. మిర్యాలగూడ టూటౌన్ ఎస్‌ఐ ఎస్. క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బాబూ జీనగర్ కాలనీకి చెందిన కుంచం వెంకన్న, ఇద్దమ్మ దంపతులకు కుమారుడు సైదులు(30), కుమార్తె సుచరిత సంతానం. తన పిల్లలు ఉన్నత స్థానంలో ఉండాలనే ఆశయంతో వెంకన్న ఆటో నడుపుతూ ఇద్దరినీ కష్టపడి చదివించాడు. తండ్రి ఆశయాన్ని నిజం చేస్తూ కుంచం సైదులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి గత రెండేళ్లుగా నల్లగొండలోని 12వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివా రం గ్రూప్–4 పరీక్ష రాసేందుకు సైదులు సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. పరీక్ష రాసిన సైదులు తిరిగి ఆదివారం ఉదయం 6:30 గంటల సమయంలో బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణకాలనీ బైపాస్ వద్ద వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. లారీ సైదులు నడుముపై నుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

సైదులు నేత్రాలను కుటుంబ సభ్యులు మిర్యాలగూడ లయన్స్ క్లబ్ సహకారంతో ఖమ్మం నేత్ర నిధికి అందజేశారు. తన చెల్లెలు సుచరితకు వివాహం చేసిన తర్వాతే తాను పెళ్లి చేసుకుంటానని చెప్పిన కుమారుడు విగతజీవిగా పడి ఉండటం చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం


ఘటనా స్థలంలో సాజిద్ మృతదేహం

మేళ్లచెరువు: బైక్ అదుపుతప్పి కాలువలో పడి యువకుడు మృతిచెందిన ఘటన మేళ్లచెరువు మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన షేక్ సాజిద్(26), నవీన్ పని నిమిత్తం శనివారం బైక్‌పై మేళ్లచెరువుకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యలో మిట్టగూడెం సమీపంలోని కందిబండ ఎన్‌ఎస్‌పీ మేజర్ కాలువ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పడంతో కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో సాజిద్ అక్కడికక్కడే మృతిచెందగా, నవీన్ గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని నవీన్‌ను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మామపై కర్రతో దాడి చేసిన కోడలు


గాయపడిన సూర్యనారాయణ

హుజూర్‌నగర్‌రూరల్: మామపై కోడలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని అంజలిపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజలిపురం గ్రామానికి చెందిన గొర్రె సూర్యనారాయణకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. సూర్యనారాయణకు 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన రెండో కుమార్తె నాగమణిని మేళ్లచెరువుకు చెందిన బండి నాగరాజుతో వివాహం జరిపించాడు. పసుపు కుంకుమల కింద నాగమణి పేరు మీద ఒక ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయించాడు. నాగమణి, నాగరాజు దంపతులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే నివాసముంటున్నారు. సూర్యానారాయణ కుమారుడు శ్రీకాంత్ ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. శ్రీకాంత్ భార్య శ్రీలత గతంలో తన వదిన నాగమణికి ఇతరుల నుంచి రూ.4లక్షలు అప్పు ఇప్పించింది. ఆ డబ్బులను ఇటీవలే నాగమణి తిరిగి శ్రీలతకు ఇచ్చింది. కాగా అట్టి డబ్బులకు సంబంధించిన వడ్డీలో రూ.25 వేలు మాత్రం తన అన్న శ్రీకాంత్ గతంలో తనకు కొన్ని డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అందులో జమ చేసుకోవాలని నాగమణి శ్రీలతకు చెప్పింది. శ్రీలతకు భర్త శ్రీకాంత్ ఎంతకి రూ.25వేలు ఇవ్వకపోవడంతో ఆమె నాగమణిపై ఒత్తిడి తెచ్చింది. నాగమణి నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆమె భూమిని కౌలుకు చేస్తున్న రైతు వద్దకు ఆదివారం శ్రీలత వెళ్లి భూమిని దున్నవద్దని ట్రాక్టర్ ఆపింది. దీంతో అక్కడే ఉన్న సూర్యానారాయణకు, కోడలు శ్రీలతకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కోడలు శ్రీలత మామ సూర్యనారాయణపై తలపై కర్రతో బలంగా కొట్టింది. చుట్టుపక్కల రైతులు గమనించి సూర్యనారాయణను హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి తెలిపారు.

విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు

- భారీ శబ్దంతో ఇన్సులేటర్లు పేలడంతో ఉలిక్కిపడ్డ స్థానికులు

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభంపై ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాసేపటికి భారీ శబ్దంతో స్తంభంపై ఇన్సులేటర్లు పేలడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను గుర్తించి మరమ్మతు చేశారు. స్తంభం నుంచి మరో స్తంభానికి అనుసంధానించిన జంపర్లు వేడెక్కి తెగినప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుందని విద్యుత్‌శాఖ ఏఈ రమ్యారెడ్డి తెలి పారు. ఇలాంటివి సర్వసాధారణమని ఆమె పేర్కొన్నారు.


స్తంభంపై చెలరేగిన మంటలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని పట్టుకోవడంతో ఘటన
- న్యాయం చేయాలని మృతుడి బంధువుల రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్


జడ్చర్ల–కోదాడ హైవేపై ఆందోళన చేస్తున్న బంధువులు, స్థానికులు


శేఖర్ (ఫైల్)

నేరేడుచర్ల: రోడ్డు దాటుతూ డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని పట్టుకొని విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి నేరేడుచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన ఓంగోజు శేఖర్(27) స్థానికంగా ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గల షెడ్డుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతూ డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని తాకగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, స్థానికులు శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నేరేడుచర్లలోని జడ్చర్ల–కోదాడ హైవేపై రెండు గంటలకు పైగా రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్ అక్కడకు చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారిని వెళ్లిపోవాలని కోరగా తమకు న్యాయం జరిగే వరకు వెళ్లేది లేదని వారు భీష్మించుకు కూర్చున్నారు. హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, హుజూర్‌నగర్, గరిడేపల్లి, పాలకీడు ఎస్‌ఐలను అప్రమత్తం చేసి రాస్తారోకో చేసే వారిని చెదరగొట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి అరుణ తన కొడుకు విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరుగా విలపించింది.

చందంపల్లి చెరువులో విష ప్రయోగం


చెరువు ఒడ్డున చనిపోయి ఉన్న చేప పిల్లలు

నకిరేకల్: మండలంలోని చందంపల్లి గ్రామ చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో చేప పిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో శనివారం గ్రామానికి చెందిన కొందరు విష ప్రయోగం చేశారు. ఆదివారం ఉదయం గ్రామస్తులు చెరువు వైపు వెళ్లి చూడగా ఒడ్డున చిన్న చిన్న చేప పిల్లలు చనిపోయి కనిపించాయి. మరోవైపు చెరువులో నీరు కూడా కలుషితంగా మారింది. చెరువు సమీపంలోనే గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోర్లు ఉన్నాయని, విష ప్రయోగం చేయడం వల్లే చేపలు, చేప పిల్లలు చనిపోయాయని, దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు దాటుతూ కూలీ మృతి


బచ్చుసింగ్ మృతదేహం

చిట్యాల: మండలంలోని పెద్ద కాపర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామ శివారులోని కోళ్ల ఫారాలలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బచ్చుసింగ్(52), అతడి భార్య అంజనాసింగ్ కొంతకాలంగా కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం బచ్చుసింగ్ కోళ్ల ఫారాల సమీపంలో జాతీయ రహదారిని దాడుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బచ్చుసింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య అంజనాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో ఆదివారం రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవతో పాటు కృష్ణానది నుంచి బిందె తీర్థం తీసుకొచ్చి పంచామృతాలతో గర్భాలయంలోని మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఆలయంలోని ముఖమండపంలో నిత్య కల్యాణంలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

డోర్నకల్ నుంచి మిర్యాలగూడకు రైలు మార్గం

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ: మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ నుంచి నేలకొండపల్లి, కోదాడ, హుజూర్‌నగర్, దామరచర్ల, మిర్యాలగూడ వరకు కొత్త రైలు మార్గం ఏర్పాటుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వే శాఖకు తాను ప్రతిపాదించిన ప్రాజెక్టులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. సర్వే, సమగ్ర ప్రాజెక్టు నివేదికకు రైల్వే శాఖ రూ.3కోట్లను మంజూరు చేసిందన్నారు. జగ్గయ్యపేట వయా జాన్‌పహాడ్, దామరచర్ల, మిర్యాలగూడ వరకు రైల్వే డబుల్‌లైన్ చేయనున్నారన్నారు. ప్యాసింజర్ రైలు నడిపే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. మేళ్ల చెర్వు నుంచి హుజూర్‌నగర్, విష్ణుపురం, మిర్యాలగూడ వరకు ప్యాసెంజర్ షటిల్ ట్రైన్ ప్రతిపాదన ఒప్పుకున్నారని అన్నారు. నల్లగొండ నియోజకవర్గం గుండా మరిన్ని రైళ్ల రాకపోకలు కొనసాగించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు మెరుగైన ప్రతిపాదనలు అందిస్తే చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, నాయకులు కోట శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ బడులను ఎవరు కాపాడుకోవాలి? ప్రభుత్వ బడులకు పిల్లలు ఎందుకు రావడం లేదు? అనే అంశంపై తెలంగాణ పౌర స్పందన వేదిక నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరి మండలంలోని నెల్లికల్లు గ్రామపంచాయతీలో రచ్చబండ(చర్చా కార్యక్రమం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచిత భోజనం అందుతుందని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలకు పంపించి ప్రభుత్వ బడులకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ పమ్మి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 15 రోజులు నెల్లికల్లు ఆవాస గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరుగుతూ సర్వే నిర్వహించి ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా కృషిచేస్తుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఇదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి, మండల విద్యాధికారి తరి రాము, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కార్తీక్, జిల్లా నాయకులు రాజు, ఎరనాగుల సైదులు, వీరాసింగ్, ప్రసాద్, సహదేవి, సరోజినిదేవి, కృష్ణవేణి, మోతీలాల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గోపయ్యచారి త్యాగం చిరస్మరణీయం


కోదాడలో గోపయ్యచారి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరుడైన పెన్‌పహాడ్ మండలంలోని చీదెళ్ల గ్రామానికి చెందిన లాన్స్ నాయక్ పి. గోపయ్యచారి త్యాగం చిరస్మరణీయమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని లారీ అసోసియేషన్ దగ్గర ప్రధాన రహదారిపై ఇండియన్ వెటరన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లాన్స్‌నాయక్ గోపయ్యచారి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికుల త్యాగాలకు వెలకట్టలేమని అన్నారు. అమరులైన సైనికుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గోపయ్యచారి ఆశయాలను సాధించాలన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ వెటరన్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గోపయ్యచారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీలపై పాలక ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు


మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

కోదాడఅర్బన్: బీసీలపై పాలక ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పెరిక భవన్‌లో నిర్వహించిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల స్థాయి బీసీ సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల మధ్య ఐక్యత లేకపోవడం వల్లనే అగ్రకులాల వారు మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యత ద్వారా రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని, తద్వారా బీసీలకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని హక్కులు పొందవచ్చన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెపల్లి అంజి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, మండలానికి ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులతో ప్రైవేట్ విద్యాసంస్థలు పేదలను దోపిడీ చేస్తున్నాయని, వారిని నిలువరించాల్సిన బాధ్యత బీసీ విద్యార్థి సంఘంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కోదాడ అధ్యక్షుడు ఇనుగుర్తి రమణాచారి, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు శ్రీకాంత్‌రాజు, బీఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లుట్ల శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి మోదేపల్లి కృష్ణమాచారి, సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయనాయుడు, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ, స్థానిక నాయకులు లింగయ్య, శ్రీనివాస్, వీరయ్య, రాజ్యం, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

చిలుకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982– 83వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలెబోయిన ధనమూర్తి, సీతరాములు, చిలువేరు, బూర వెంకటేశ్వర్లు, పిల్లుట్ల కొండలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాపాలను ప్రజలకు తెలియజేయాలి


ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ విస్తారక్ చైతన్య, నాయకులు

చౌటుప్పల్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పాపాలను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యం చేయాలని కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చౌటుప్పల్ మున్సిపాలిటీ బీజేపీ విస్తారక్ చైతన్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 26, 27 బూత్‌లలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి దాసోజు భిక్షమాచారి అధ్యక్షతన ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయాలను తెలియజేస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్కాంలు తప్ప స్కీంలు లేవన్నారు. బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. రాష్ట్రంలో అవినీతిరహిత పాలన కోసం ప్రజలంతా బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, బూత్ అధ్యక్షులు ఊదరి రంగయ్య, కడారి అయిలయ్య, నాయకులు పిల్ల బుచ్చయ్య, తడక సురేఖ, గోశిక నీరజ, తొర్పునూరి నర్సింహ తదితరులు ఉన్నారు.

యాదాద్రీశుడి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయ పరిసరాల్లో కిటకిటలాడుతున్న భక్తులు


మంత్రి, ఎమ్మెల్యేల వెంట వచ్చిన వారి అనుచరులు, నాయకులతో కిక్కిరిసిన ప్రధానాలయం

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారి ధర్మదర్శనానికి 4గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి 3గంటల సమయం పట్టింది. దీంతో క్యూలైన్‌లో గంటల కొద్దీ నిలబడిన భక్తులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయానికి సోమవారం రూ.54,03,802 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భక్తుల ఇబ్బందులు..

ఆలయ దివ్య విమాన గోపురానికి బంగారం తాపడం కోసం విరాళం ఇచ్చేందుకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందతో పాటు మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆలయానికి రాగా వారి వెంట దాదాపు 1000 మంది కార్యకర్తలు తరలిరావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే అనుచరులు ఒక్కసారిగా ప్రధానాలయంలోకి రావడంతో సందడి నెలకొంది. దీంతో సామాన్య భక్తులను ఆలయ అధికారులు పట్టించుకోలేదు. బ్రేక్ దర్శనం టైం అయిపోయినా ఆలయ అధికారులు వీఐపీలకు బ్రేక్ దర్శనం టికెట్‌లు కల్పించడంతో సామాన్య భక్తులు ఇక్కట్లు పడ్డారు. స్వామి వారి దర్శనం అనంతరం బయటకు వెళ్లే క్రమంలో హుండీ దగ్గర ఒక్కసారిగా తోపులాట జరిగింది. దీంతో అక్కడ క్యూలైన్లలో వెళ్తున్న భక్తుల్లో ఒక మహిళ కింద పడిపోయింది.